గన్‌పార్కుకు తరలిన

బీఆర్‌ఎస్ శ్రేణులు



తరలివెళ్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, తదితరులు

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో గన్‌పార్కు వద్ద నివాళులర్పించిన అనంతరం అమర జ్యోతి వరకు కొవ్వొత్తుల ర్యాలీ ఉంటుందన్నారు. తెలంగాణ సాధన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, జూపల్లి సత్యనారాయణ, మంజుల రఘునాథ్ రెడ్డి, రోజాదేవి రంగారావు, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, మాధవరం రంగారావు, శ్రేణులు పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచి..

ఓల్డ్ బోయిన్‌పల్లి: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీకి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచి నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, మేకల హరినాథ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, పిట్ల రాజు, బల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, నగేశ్, కృష్ణారెడ్డి, మట్టి శ్రీను, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తరలివెళ్తున్న ఓల్డ్ బోయిన్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకులు



వేడుకల్లో పాల్గొన్న బొప్పన పరమేశ్వరరావు, శ్రీదేవి దంపతులు



కబీర్‌నగర్‌లో వడమాల, తమలపాకుల దండతో ఆంజనేయస్వామి



పాండురంగనగర్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వివేకానందనగర్‌లోని ఆంజనేయ స్వామి

ఘనంగా హనుమాన్ జయంతి

- ఆలయాల్లో భక్తుల పూజలు
- ప్రత్యేక కార్యక్రమాలు, అన్నదానాలు

కూకట్‌పల్లి నియోజకవర్గవ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీల వారు ఉదయం నుంచే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకుపూజ, అర్చనలు చేశారు. పలుచోట్ల మధ్యాహ్నం అన్నదానాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం



పర్వత్‌నగర్‌లోని పర్వత వర్థిని శివాలయ ఆవరణలోని ఆంజనేయస్వామి



హరిహర క్షేత్రంలో పూజలు చేస్తున్న అర్చకులు



బాగ్ అమీర్‌లోని ఆలయంలో తెల్ల హరికృష్ణ



బాలాజీనగర్‌లో మాజీ కార్పొరేటర్ బాబురావు పూజలు



సంజీవని ఆలయంలో పూజలు చేస్తున్న బండి రమేశ్, వేంకటేశ్వరరావు తదితరులు

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శ్రీశైల భ్రమరాంభిక మల్లిఖార్జున స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఉదయం అభిషేకం సమయంలో స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూపల్లి సత్యనారాయణ, నాయినేని తులసీరావు, మామిడాల రవీందర్‌రెడ్డి, రజాక్ పాల్గొన్నారు.

‘ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను అరెస్టు చేయాలి’



పన్నాల రాజశేఖర్ రెడ్డి

మోతీనగర్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గణేశ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పన్నాల రాజశేఖర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ జాతీయ గీతంతో పాటు, చిహ్నం ప్రజల ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్ రెడ్డి రూపకల్పన చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

టెన్త్ టాపర్‌కు సన్మానం



టెన్త్ టాపర్ ధార్మికను సన్మానించిన కుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన ఎస్. మురళీకృష్ణ కుమార్తె ధార్మిక శంషీగూడ పాఠశాలలో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. దీంతో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ శనివారం ధార్మికను శాలువాతో సన్మానించి నగదు బహుమతిని అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన ధార్మిక అరకొర వసతులతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివి మెరిట్ సాధించడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో కూడా డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో చదివి టాపర్‌గా నిలిచే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తానని తెలిపారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు శనివారం కిలోకి ఈ విధంగా ఉన్నాయి. టమాట 27, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజీ 16, బీన్స్ 95, క్యారెట్ 40, గోబిపువ్వు 23, దొండకాయ 18, చిక్కుడుకాయ 75, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలుగడ్డ 28, కీరా 18, దోసకాయ19, సొరకాయ 11, పొట్లకాయ 15, కంద 65, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 28, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 23, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు 65 నుంచి 75, మునగకాయలు 4 నుంచి 5, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97.

దివ్యాంగ విద్యార్థులకు అండగా సర్కారు..!

- కూకట్‌పల్లి జడ్పీ పాఠశాలలో ఉచితంగా ప్రత్యేక శిక్షణ
- ట్రైనింగ్ ఇస్తున్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు





దివ్యాంగుల ఉచిత శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఐఈఆర్‌పీ విభాగం రిసోర్స్ పర్సన్స్, తదితరులు



ఆల్విన్‌కాలనీ: వివిధ రకాల అంగ వైకల్యంతో బాధపడుతున్నవారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. వారు సమాజంలో ఆత్మ విశ్వాసంతో గౌరవంగా బతికేలా ఉచిత శిక్షణ అందిస్తున్నది. కూకట్‌పల్లి జడ్పీ పాఠశాలలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు దేదీప్య, మాధవి శిక్షణ అంగవైకల్యం, మూగ, చెవిటి, ఆటిజం వంటి వారికి సైగలు, స్పర్శ, మాటలు రాని వారికి శబ్దంతో ట్రైనింగ్ ఇస్తున్నారు. 2004 నుంచి ఈ శిక్షణ కేంద్రం కొనసాగుతోంది. ఇప్పటికే ఎంతోమంది దివ్యాంగ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి మామూలు విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దారు. క్రీడలు, సంగీతం, శబ్దం, పాటలు, మాటలు, సైగలు వంటి వాటితో వైకల్యం పొందిన చిన్నారుల్లో క్రమంగా మార్పు తీసుకువస్తున్నారు.6 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు బుద్ధిమాంద్యం, ఆటిజం ఏడీహెడీ ఉన్న పిల్లలకు శిక్షణ ఇవ్వడం ఎంతో కష్టంతో కూడుకున్న పని అని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు తమదైన శైలిలో వారి అవసరాలకు తగ్గట్టుగా వారికి అనుగుణంగా పాఠాలు బోధిస్తున్నారు. ఈ కేంద్రానికి వచ్చే పిల్లలకు రోజువారీ ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, స్టైఫండ్, వివిధ రకాల ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని వారు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రంలో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటివి చిన్నారుల కోసం అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ తర్ఫీదు పొందిన విద్యార్థుల్లో చురుగ్గా ఉన్న వారిని గుర్తించి మాములు తరగతుల్లోకి చదువుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని అంగవైకల్య విద్యార్థులు తల్లిదండ్రులు వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. కావాల్సిన వారు కూకట్‌పల్లి జడ్పీ పాఠశాలలోని ఐఈఆర్‌పీ విభాగం రిసోర్స్ పర్సన్స్ దేదీప్య, మాధవిని సంప్రదించాలని కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కూకట్‌పల్లి దేదీప్య ఫోన్ నంబర్ 7396996688, బాలానగర్ ఐఆర్‌పీ మాధవి 7731907596 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులకు సన్మానం



రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎం మహ్మద్ ఇషాక్ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ శంకరయ్య, ఏడీసీలు ఏవీగౌడ్, రాంరెడ్డి, కండక్టర్ పవన్‌కుమార్, చార్లెస్ పాల్ ఉద్యోగ విరమణ పొందారు. శనివారం డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్ వారిని పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, నాయకులు మల్లారెడ్డి, ఐలయ్య, మురళీ కృష్ణ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్, టి. శ్రీనివాస్‌రెడ్డి, రవి, సోమేశ్, పీవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ తెలిపారు. 2వ తేదీన ఉదయం 8 గంటలకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ నిర్వహిస్తామన్నారు.9 గంటలకు తెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరణ అనంతరం కేసీఆర్ సభ జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేంకటేశ్వర స్వామికి స్వర్ణ కిరీటం బహూకరణ



బంగారు కిరీటంను తెస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ వేంకటేశ్వర స్వామికి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, సతీమణి శ్యామలదేవి, కుమారుడు పృథ్వీ గాంధీలతో శనివారం స్వర్ణ కిరీటంను బహుకరించారు. కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌ల పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సాయి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు ప్రవీణ్, సందీప్‌రెడ్డి, నరేందర్ బల్ల, యశ్వంత్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: విజయవాడలోని శ్రీ కనకదుర్గ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ దర్శించుకున్నారు.

‘ఇస్తారా’ బదులుగా ‘ఇస్తా’..!

- నకిలీ క్యూఆర్ కోడ్‌తో కంపెనీ సొమ్ము బదిలీ
- రూ.4.15 కోట్లు కాజేసిన ఉద్యోగులు
- ఈ సొమ్ముతో ప్లాట్ కొనుగోలు, అప్పుల చెల్లింపులు
- ఇద్దర్ని అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: కంపెనీ పేరు ‘ఇస్తారా’ బదులుగా ‘ఇస్తా’ అని నకిలీ కంపెనీని ఏర్పాటు చేసి, దాని పేరుతో నకిలీ క్యూఆర్ కోడ్‌ను సృష్టించి ఏకంగా కంపెనీ సొమ్మును వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారు ఇద్దరు ఉద్యోగులు. రూ.4.15 కోట్లు కొట్టేసిన ఇద్దరు నిందితులను సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ ప్రధాన కేంద్రంగా ఇస్తారా పార్క్స్ ప్రై.లి. దేశంలోని 16 నగరాల్లో ఫుడ్ కోర్టులను నిర్వహిస్తుంది. ఈ కంపెనీలో చెంగిచెర్లకు చెందిన యాసిరెడ్డి అనిల్ కుమార్, సికింద్రాబాద్‌కు చెందిన మండలం రాజ్‌కుమార్ ఫ్లోర్ మేనేజర్లుగా పనిచేసేవారు. దుర్బుద్ధితో కస్టమర్లు చెల్లించే సొమ్మును సంస్థ ఖాతాలో కాకుండా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా నకిలీ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. ఇలా నిందితులు గతేడాది మార్చి నుంచి రూ.4.15 కోట్లు మళ్లించారు. ఈమేరకు సంస్థ ప్రతినిధి మహ్మద్ ఇర్షాద్ సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు.. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ కొట్టేసిన సొమ్ములో రూ.40 లక్షలు పెట్టి ప్లాట్ కొనుగోలు, రూ.10 లక్షలతో అప్పులు తీర్చుకోవడంతో పాటు ఈ మోసంలో సహకరించిన సహోద్యోగులకు రూ.70 లక్షలు, చిట్టీ నిర్వాహకులకు రూ.60 లక్షలు చెల్లించామని, మిగిలిన సొమ్మును వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేశారు.

సకాలంలో అభివృద్ధి పనులు

నిజాంపేట్: బాచుపల్లిలోని 21 డివిజన్ సాయినగర్‌లో మంజీర వాటర్‌లైన్ పైపులైన్ పనులను నిర్వహించారు. స్థానిక ప్రజలకు సరైన పైపులైన్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో పలుసార్లు స్థానిక కార్పొరేటర్ కాసాని శిరీష నిజాంపేట్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యపై చర్చించారు. గతంలోనే ఈ పనుల కోసం టెండర్లు సైతం పూర్తికాగా.. సాయినగర్‌లో పనులను పూర్తి చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళాసిల్క్ చేనేత హస్త కళ ప్రదర్శనకు ఆదరణ





మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు విశేష స్పందన వస్తున్నదని నిర్వాహకుడు వినోద్ జైన్ తెలిపారు. ఈ మేళాలో పట్టు, ఫ్యాన్సీ డిజైనర్, పోచంపల్లి చీరలు, డ్రస్ మెటీరియల్స్, చుడీదార్స్, సూటింగ్స్ షర్టింగ్స్, జ్యువెల్లరీ, బెడ్ షీట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడల్లో ప్రఖ్యాతి పొందిన చీరలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డ్రస్ మెటీరియల్స్, డోర్ కార్టన్స్, స్టోన్ జ్యువెల్లరీ, పెరల్స్, క్రాఫ్ట్స్, బంజారా, కోల్‌కత్తా బ్యాగులు, ఒడిస్సా పెయింటింగ్స్ ఉన్నాయని తెలిపారు. అన్ని రకాల వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని తెలిపారు.

వరల్డ్ సైకిల్ డే



లిటిల్ మిలీనియం స్కూల్ చిన్నారుల సైకిల్ రైడ్

గచ్చిబౌలి: వరల్డ్ బైసైకిల్ డేను పురస్కరించుకొని చిన్నారులు సైకిల్ తొక్కుతూ అందరినీ ఆకట్టుకున్నారు. కొండాపూర్‌లోని లిటిల్ మిలీనియమ్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక సైకిల్ రైడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో చదివే చిన్నారులను స్కూలుకు రప్పించి సైకిల్ రైడ్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఈ రైడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

సనత్‌నగర్: ప్రముఖ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ ఓం ప్రకాష్ బిడ్లాన్ జీ స్మారక ఓపెన్ అండ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోశాధికారి రవిసింగ్ బిడ్లాన్ తెలిపారు. సనత్ నగర్ వాల్మీకి జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో జరిగే ఈ పోటీల్లో భాగంగా తొలిసారిగా ‘ఫస్ట్ ఓపెన్ స్టేట్ హ్యాండికాప్డ్’ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్‌ను కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారన్నారు.

బిల్డర్ మోసం చేశాడు.. న్యాయం చేయాలి

కేఎస్ఆర్ టుగెదర్‌మెంట్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యుల ఆందోళన



బిల్డర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కేఎస్ఆర్ టు గెదర్‌మెంట్స్ అపార్ట్‌మెంట్ బిల్డర్ తమను మోసం చేశాడని శనివారం అపార్ట్‌మెంట్ ముందు ఫ్లాట్స్ ఓనర్స్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేఎస్ఆర్ టుగెదర్‌మెంట్స్ అపార్ట్‌మెంట్స్ బిల్డర్ హరినాథ్‌రావు ఫ్లాట్ యజమానులను మోసం చేశాడన్నారు. అపార్ట్‌మెంట్‌కు చెందిన మెయింటినెన్స్ డబ్బులు సుమారు రూ.3 కోట్లు బిల్డర్ వద్దనే ఉన్నాయని, భవనానికి కొంత మేర ఖర్చు చేయగా మరో రూ.2 కోట్లు అతని వద్దే ఉన్నాయన్నారు. వాటి గురించి నిలదీయగా కాలయాపన చేస్తున్నారన్నారు. రెరా, జీహెచ్‌ఎంసీ, ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు విరుద్ధంగా రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ షాపులను నిర్మించి విక్రయించాడన్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయగా దుకాణాలను కొంత మేర కూల్చివేశారన్నారు. అనంతరం బిల్డర్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్‌పై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తమను ఇబ్బందులకు గురిచేశాడన్నారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు కెఎస్ఆర్ టుగెదర్‌మెంట్స్ బిల్డర్‌పై చర్యలతో పాటు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాజాతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు అవకాశాలు కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధితో పాటు రాజకీయ పాలన పదవుల్లో అవకాశాలు కల్పించాలని రీసెర్చ్ స్కాలర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అమరుల కుటుంబాలను సన్మానించి, వారి సంక్షేమానికి నిధిని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

డయాలసిస్‌పై నోడల్ అధికారులకు అవగాహన

గాంధీ ఆస్పత్రి: కిడ్నీ సంబంధిత వ్యాధులు, డయాలసిస్‌పై నోడల్ అధికారులతో గాంధీ ఆస్పత్రిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హబ్ అండ్ స్పోక్ మోడల్ కింద గాంధీ హబ్‌కి సంబంధించి 22 స్పోక్ సెంటర్ల నోడల్ ఆఫీసర్లతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో విశాలాక్షి మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన సదస్సులతో నోడల్ ఆఫీసర్ల నైపుణ్యం పెరిగి మారుమూల ప్రాంతాల్లో ఉండే డయాలసిస్ రోగులకు మంచి వైద్యం అందుతుందన్నారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధి తీవ్రత, దాని ప్రభావం కుటుంబంపై పడుతుందన్నారు. డాక్టర్ రాజారావు నెఫ్రాలజీ విభాగం వైద్యులు చేస్తున్న సేవలను కొనియాడారు.